క్లుప్తంగా

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

దొనకొండ: వేగంగా ఆటో వెళ్తూ వ్యక్తిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెద్దగుడిపాడు ఎస్సీ కాలనీ మెయిన్ రోడ్డులో సోమవారం జరిగింది. తెలిసిన వివరాలు.. పెద్దగుడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన గన్నెపల్లి ఆనందరావు గంగదేవిపల్లి గ్రామానికి పనిపై వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా వేగంగా వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో ఆనందరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఎంటీ వెలుగొండయ్య, పైలట్ నరేష్‌బాబును ఓఈ రాజేంద్రప్రసాద్, డీఎం విజయ్‌కుమార్ అభినందించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



పుట్టిన బిడ్డతో 108 సిబ్బంది

దర్శి: మండలంలోని అగ్నిపురి కాలనీకి చెందిన గుంటూరు యశోద అనే మహిళకు పురిటి నొప్పులు వచ్చాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె నివాసానికి చేరుకున్న ఈఎంటీ వేణుగోపాల్, పైలట్ నరేష్‌బాబులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అమెకు నెప్పులు అధికంగా వస్తున్నందున వెంటనే కాన్పు చేయాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు సిబ్బంది 108 వాహనంలోనే కాన్పు చేశారు. యశోద పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. యశోద కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షల కోసం తల్లి, బిడ్డను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

కులగణనలో కూటమి నిప్పు

- తప్పుల తడకగా ఎస్సీల ఉప కులగణన
- భార్యాభర్తలు, తండ్రి, కుమార్తెల వేర్వేరు కులాలుగా పరిగణన



అధికారులు ప్రచురించిన కులగణన జాబితా

కురిచేడు: ఎస్సీ కులగణనలో కూటమి ప్రభుత్వం అయా సామాజిక వర్గాల మధ్య నిప్పు రాజేసింది. ఏపీ ప్రభుత్వం షెడ్యూల్ కులాల్లోని ఉప కుల వర్గీకరణపై విచారణ చేసేందుకు రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలున్నాయి. ఒకే కుటుంబంలో భార్యది ఒక మతం, భర్తది మరో మతం, పిల్లలది ఇంకో మతం పేరుతో కులగణన అధికారులు పరిగణ చేసి జాబితాలు ప్రచురించారు. అందులోనూ మాదిగలను ఆది ఆంధ్ర మాదిగ కాకుండా క్రిస్టియన్ మాదిగగా ఎక్కువగా చూపించి మాదిగల జనాభా శాతం తగ్గించే ప్రయత్నం జరుగుతోందని మాదిగలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. కులగణన పూర్వాపరాలను పరిశీలిస్తే మండలంలో మొత్తం 10,124 మంది ఎస్సీలు ఉన్నారు. భారతదేశం హిందూ దేశం. ప్రతి ఒక్కరూ కులాలు వేరైనా మతం విషయంలో హిందూ అని ఉంటుంది. ఎస్సీలు కూడా వారికి పాఠశాలలో ఇచ్చిన సర్టిఫికెట్‌ను పరిశీలిస్తే ఇండియన్ హిందూ మాదిగ (మాల) ఇలా ఉంటుంది. ఎక్కడా క్రిస్టియన్ అనే పదం లేదు. అంతేగాకుండా క్రిస్టియన్ అంటే బీసీ–సి కోటాలోకి వెళ్తుంది. అలాగని ఇక్కడ క్రిస్టియన్‌లుగా నమోదు చేసిన వారికి క్రిస్టియన్ సర్టిఫికెటు కూడా మంజూరు కాదు. కురిచేడు పంచాయతీలోని కులగణనను పరిశీలిస్తే గణన ఎంత నిబద్ధతతో జరిగిందో అర్థమవుతోంది. అధికారుల లెక్కల ప్రకారం కురిచేడు పంచాయతీలో మొత్తం 1382 మంది ఎస్సీలున్నారు. వారిలో 794 మంది మాదిగలు, 588 మంది మాలలున్నారు. మాదిగలు 794 మందిలో 174 మందిని క్రిస్టియన్లుగా పరిగణించారు. మాలలు 588 మందిలో 40 మందిని క్రిస్టియన్లుగా పరిగణించారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఒకే కుటుంబంలో భార్యాభర్త, పిల్లల మధ్య ఉప కులాల వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు నమోదు చేయడం వారి సర్వేకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎస్సీ కాలనీకి చెందిన కోలా ఆశీర్వాదం క్రిస్టియన్, ఆయన భార్య మాణిక్యమ్మ మాదిగ, ఆయన చిన్న కుమారుడు ఏసుదాసు క్రిస్టియన్, ఏసుదాసు భార్య భాగ్యరేఖ, పిల్లలు ఇద్దరు మాదిగలుగా నమోదు చేయడమే సర్వే తీరుకు అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏ పథకం మంజూరు చేసినా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతాలు కేటాయిస్తారు. దానిలో మాదిగలకు ఎక్కువ శాతం పోకుండా అడ్డుపడేందుకు క్రిస్టియన్లుగా నమోదు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇటు ఎస్సీల్లోని ఉప కులాల మధ్య చిచ్చుతో పాటు బీసీ, ఎస్సీల మధ్య ప్రభుత్వం నిప్పు రాజేసింది. దీంతో ఈ మూడు కులాలు రిజర్వేషన్ల విషయంలో గొడవలు పడుతుంటే వారికి ఇవ్వాల్సిన రిజర్వేషన్లు, పథకాలు అమలు చేయకుండా ఉండవచ్చనే ఆలోచనతో ఇలా చేస్తున్నారని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసలు కులగణన చేసిన అధికారులు ఏ శాఖకు చెందిన వారో అర్థం కావడం లేదని, అధికారులు ఇంటింటా సర్వే చేశారా? లేక కార్యాలయంలో కూర్చుని పేర్ల ఆధారంగా వారి ఇష్టానుసారం కులగణన చేశారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన ఎస్‌ఐ సంపత్



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

- మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పుల్లలచెరువు: శాంతి భద్రతల నిర్వహణలో జవాబుదారీగా ఉంటూ పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రామస్తుల సహకారంతో వివిధ గ్రామాల కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ అవరణను పరిశీలించి వివిధ గ్రామాలకు చెందిన పోలీసు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ చట్టం దృష్టిలో అంతా సమానమేనని, ఎవరూ అతీతులు కారని, ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన వారిని మర్యాదగా పలకరించి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని చెప్పారు. స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామం ప్రశాంతంగా ఉండేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో పొలం తగాదాలు, నగదు వివాదాలు, ఆస్తి పంపకాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇటీవల కాలంలో జరిగిన లోక్ ఆదాలత్ కార్యక్రమంలో పుల్లలచెరువు పోలీసుస్టేషన్ పరిధిలో 13 కేసులు పరిష్కారం కావడంతో ప్రత్యేకంగా ఎస్‌ఐ సంపత్‌కుమార్‌ను డీఎస్పీ నాగరాజు అభినందించారు. స్టేషన్ పరిధిలో ఇటీవల క్రైమ్ రేటు బాగా తగ్గిందని చెప్పారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరించాలని చెప్పారు. నూతన సంవత్సర వేడుకలను జాగ్రత్తగా జరుపుకోవాలని, ప్రతి గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో మండలంలో ఏం జరుగుతుందని తెలుసుకునే వీలుంటుందని, పుల్లలచెరువు పోలీసుస్టేషన్‌ను ఆదర్శంగా తీసుకుని డివిజన్ మొత్తంలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్‌ఐ సంపత్‌కుమార్ ఉన్నారు. రికార్డులు, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎస్‌ఐని డీఎస్పీ నాగరాజు అభినందించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన డైరీ, క్యాలెండర్, జీఓ పుస్తకాలను మండల విద్యాశాఖాధికారి రమాదేవి చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ నూతన శాఖ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.ఖాశీం, గౌరవ అధ్యక్షుడు ఎం.యల్లమందారెడ్డి, సహాధ్యక్షుడు అట్లూరి రామారావు, కోశాధికారి కె.రామారావు, నాయకులు విజయ్‌కుమార్, చెంచయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి, బాజీవలి, మస్తాన్‌వలి, విజయభాస్కర్, కోటిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్, డైరీ, జీఓ పుస్తకాలను మండల విద్యాశాఖాధికారులు సుబ్బారావు, వెంకటేశ్వర్లు సోమవారం ఆవిష్కరించారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కొంజేటి సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గోగుల కోటేశ్వరరావు, నాయకులు బాచిన పూర్ణచంద్రరావు, ఫణిదం శ్రీనివాసరావు, కోటేశ్వరకుమార్, తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, సురభి, ఆదాం, శ్రీనివాసరావు, చంద్రమోహన్ నాయక్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: గ్రామాల్లోని రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. మండలంలోని పెదన్నపాలెం, లక్ష్మీనారాయణపురం రెవెన్యూ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలు తహసీల్దార్ స్వీకరించారు. వీఆర్‌ఓలతో అర్జీలను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. వీఆర్‌ఓ రంగయ్య, సర్వేయర్ సుధ పాల్గొన్నారు.

11 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీల ప్రతినిధులు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన జాబ్‌మేళాలో 11 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు కాలేజీ స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.నగేష్ తెలిపారు. సోమవారం జరిగిన జాబ్‌మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 35 మంది దరఖాస్తు చేసుకోగా 11 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీ రమణ, స్కిల్ హబ్ అసిస్టెంట్ శివ, హెటిరో డ్రగ్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పని భారం.. వేతనం ఘోరం!

- పొదిలిలో పారిశుధ్య కార్మికులపై పని భారం
- పట్టణ పంచాయతీలో అవసరమైన కార్మికులు 180 మంది
- పని చేస్తున్నది 70 మంది మాత్రమే..
- వారిలోనే మేస్త్రీలు, ఇతర పనులకు..
- ఇంజినీరింగ్ కార్మికులకు అత్తెసరు వేతనం
- అమలుకు నోచుకోని ఒప్పందాలు



చెత్త ఎత్తుతున్న కార్మికులు

పొదిలి: పాండవులు మంచం కోళ్ల వలే ముగ్గురు అని రెండు వేళ్లు చూపించిన చందంగా ఉంది పొదిలి నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఖ్యా వ్యవహారం. ఇక్కడ జనాభాకు అనుగుణంగా మొత్తం 180 మంది వరకు పనిలో ఉండాలి. కానీ కేవలం 70 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ముగ్గురు మృతి చెందగా.. మిగిలిన వారిలో 15 మంది మేస్త్రీలు ఉన్నారు. ఒకరు నగర పంచాయతీ కమిషనర్ ఆఫీసులో సేవలందిస్తున్నారు. రోజూ వివిధ కారణాలతో ముగ్గురు లేదా నలుగురు సెలవులో ఉంటున్నారు. మొత్తం మీద క్షేత్ర స్థాయిలో 50 మంది మాత్రమే పని చేస్తున్నారు. వాస్తవానికి 180 మంది చేయాల్సిన పనిని ఈ 50 మంది మాత్రమే చేయాల్సి వస్తోంది. అంటే ముగ్గురు చేయాల్సిన పనిని ఒకరే చేయాల్సి వస్తోంది. పనిభారం అధికం కావడంతో సాయంత్రానికి ఒళ్లు హూనమవుతోందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో కంప్యూటర్, నీటి సరఫరా, విద్యుత్ తదితర పనులను 13 మంది కార్మికులు చేస్తున్నారు. తమపైనా పనిఒత్తిడి తీవ్రంగా ఉందని ఇంజినీరింగ్ కార్మికులు వాపోతున్నారు.

భారం రెట్టింపు

కార్మికులు రోజు వారీగా చేసే పని కాకుండా, సైడు కాలువల ఆక్రమణల తొలగింపునకు సంబంధించి వారిపై అదనపు పని భారం పడింది. మట్టి చదును చేయటం, కాలువలను శుభ్రం చేయడం, మట్టి ఎత్తి పోయడం లాంటి పనులు పెరిగాయి. పండుగల సమయంలో ఆలయాల వద్ద, ఫంక్షన్ల సమయంలో ప్రైవేట్ గృహాల వద్ద పేరుకుపోయే చెత్త ఎక్కువగానే ఉంటుండటంతో పని భారం రెట్టింపు అవుతోంది.

అత్తెసరు వేతనంతో సరి

ఇంజినీరింగ్ కార్మికులు 13 మంది నెలకు రూ.15 వేల అత్తెసరు జీతంతోనే పని చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు సంబంధించి కాంట్రాక్ట్ వర్కర్లకు రూ.21 వేలు ఇస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వేతనం అమలు కావడం లేదు. దీంతోపాటు సబ్బులు, బూట్లు, గ్లౌసులు సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

అమలుకు నోచుకోని ఒప్పందాలు

సమ్మె కాలంలో ప్రభుత్వం పలు సమస్యలు పరిష్కారం చేస్తామని, ఒప్పందాలు చేసుకుంది. అయితే ఆ ఒప్పందాలు ఏమీ అమలు కావటం లేదు. 10 సంవత్సరాల సర్వీస్ ఉన్న వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లో బాగంగా రూ.75 వేలు ఇవ్వాలి. హెల్త్ అలవెన్స్ బకాయిలు ఇవ్వడం లేదు. మట్టి ఖర్చులు పెంపుదల చేయలేదు.

విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ

తాళ్లూరు: లక్ష్య జాబ్ స్కిల్స్ అకాడమి ఆధ్వర్యంలో పాస్‌పోర్ట్ టూ లెర్నింగ్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఒకేషనల్ ట్రైనర్ వై.అంజిబాబు తెలిపారు. సోమవారం మండలంలోని తూర్పుగంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు యూనిసెఫ్, నీట్ ఫౌండేషన్, లక్ష్య జాబ్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో డిజిటల్ ప్రొడక్టివిటీ కోర్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మండల విద్యాశాఖాధికారి–2 చేతుల మీదుగా విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇప్పటి వరకు దాదాపు 3500 మంది విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ అందించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాఠశాలలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే వారిలో నైపుణ్యం పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ అరుణ కుమారి పేర్కొన్నారు. శిక్షణ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడుతుందని ఆమె తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, పవన్, విజయకుమార్, డేవిడ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సోలార్ విద్యుత్‌పై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

తాళ్లూరు: సోలార్ విద్యుత్ వినియోగంపై మండలంలోని నాగంబొట్లపాలెంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పీఎం సూర్య ఘర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌ను ప్రభుత్వం సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ మోటారు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఈ వి. శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ముండ్లమూరు (దర్శి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలను కలుపుకుని మండలంలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం స్థానికంగా నిరసనగా వ్యక్తం చేశారు. బీజేపీ డౌన్ డౌన్. అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేషాలు పాలరలను పరిచి ఆ చాటున దేశ సంపదను కొద్ది మంది తమ ఆశ్రితులకు సమర్పిస్తున్నారని మండిపడ్డారు. పేదరికాన్ని ప్రజల ఈతి బాధలను పట్టించుకోవడం లేదని చెప్పారు. ప్రజలు పోరాడకుండా దారి తప్పించేందుకు మతోన్మాద విషపు బీజాలు వెదజల్లుతూ అంబేడ్కర్ అనడం దేశంలో ఫ్యాషనైందని, దాని బతులు భగవంతుడా అని వందసార్లు అంటే స్వర్గానికి వెళ్తారంటూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు భవిష్యత్‌లో ఎవరూ చేయకుండా కేంద్రమంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సత్యం హనుమంతరావు, మీరావలి, ఎర్రయ్య, రామాంజి పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ సమయాన్ని పొడిగించాలి



కృష్ణాపురంలో మాట్లాడుతున్న నాయకులు

దర్శి: సోషల్ ఆడిట్ సమయాన్ని పొడిగించాలని ఎంఈఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు అట్లూరి రామారావు, ఆర్.యోహాన్ డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణాపురంలో సోమవారం ఎస్సీ, ఎస్టీలతో సమావేశం అనంతరం రామారావు, యోహాన్‌లు మాట్లాడుతూ మండలంలో సోషల్ ఆడిట్ ద్వారా ఎస్సీ,ఎస్టీ జాబితాల విడుదలలో ఎస్సీ, ఎస్టీలను క్రిస్టియన్‌గా చూపారన్నారు. సోషల్ ఆడిట్‌లో దొర్లిన పొరపాట్లను సరిచేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్నీ గ్రామాల్లో మొత్తం ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాధితుల సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆర్.కోటయ్య, బండి దేవప్రసాద్, బెంజిమన్, యోహాను, ఆల్‌ఫ్రెడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వసంతరావునాయక్

పుల్లలచెరువు: గ్రామాల్లో జరుగుతున్న బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో వసంతరావు నాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బడిమానేసిన కిశోర్ బాలికలకు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ బడిబాట పట్టాలని, అందరు చదువుకున్నప్పుడే బాల్య వివాహాలు జరగవని చెప్పారు. సూపర్‌వైజర్ శివలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం కౌమార దశలో ఉన్న బాలికలు అనిమీయా వ్యాధితో బాధపడుతున్నారని, వారు ఎలాంటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారో వివరించినట్లు తెలిపారు. డాక్టర్ నరసింహం మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమని, అలా చేస్తే వారి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని, దీంతో అనేక పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మండల అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు అధికారుల తమ వంతుగా కృషి చేయాలన్నారు. ఈవోఆర్డీ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.